# కాంకరర్స్ ఆఫ్ ది స్టీల్ సిటీ

## బి.ఆర్.నాగ్

జీతం అందింది. కోతలు ఎక్కువా, చేతికొచ్చింది తక్కువాను. ఇంట్లో ఖర్చులు, స్వంత ఖర్చులు, కోరికలూ — అబ్బబ్బా! నెల్లంతా ఎలా?

"హలో గురువు గారూ !" ప్యూను అప్పలస్వామి పలకరిస్తూ, పళ్లికిలిస్తూ, నమస్కరిస్తూ ---


'వెధవేదుపేదో డైరక్ట్‌గా ఏడవ్వచ్చుగా వడ్డీ కోసమని! చేసేది ప్యూను పని. ఆఫీసర్ దగ్గర్నుండీ అటెండర్ వరకూ అందరికీ అప్పులిచ్చి జీతాల్నాడు రూపాయికి పదిపైసలు వడ్డీ చొప్పున గుంజుతున్నాడు వెధవ — సార్థక నామధేయుడు. టర్నోవర్ లక్షపైనే. అంటే నెలకు పదివేలు. అందుకే స్కూటర్ మెయిన్‌టైన్ చేస్తున్నాడు రాస్కెల్. అందరి వుసురూ తగిలి ఛస్తాడులే. అమ్మో — వీడులేకపోతే అవసరాలకు అప్పెవడిస్తాడు?' వడ్డీ యిచ్చి పంపేశాను పైకి నవ్వుతూ.

"బ్రదర్! ఈ వేళ సాంగ్స్! తెలుసుగా — నువ్వూ పాడతావేంటి"? అంటూనే వెళ్లిపోయాడు సుబ్రమణ్యం. నెలనల జీతాల్నాడు బాలసుబ్రహ్మణ్యం కంటె బాగా పాడతాడు చీటీ పాటలు. చేసేది గుమాస్తా వుద్యోగమైనా, మొత్తం ఆఫీసులో అందరితో చీటీలు కట్టించి నూటికి మూడు కమీషను తీసుకుంటాడు. నెలనాడు యీరాబడి మూడు జీతాలతో సమానం. ఫాయిమదుపు లేని వ్యాపారం!

ఆఫీసు మండి బయల్దేరబోతూ వుంటే హడావిడిగా వచ్చాడు ఎలమందచేతిలో బ్లూ ప్రింట్స్‌తో.

"సార్! ఈ మధ్యనే పదెకరాలు తీసుకున్నాను పెందుర్తిలో. పక్కా 'లేఅవుట్. ముందు వైపు ప్లాట్లన్నీ అయిపోయాయి. మీకు కావాలంటే నా కోసం వుంచుకున్న రెండిట్లో ఒకటిచ్చేస్తాను. ఎవరికీ చెప్పకండి. మన PF సెక్షన్ వాళ్లంతా తీసుకున్నారు. మీరు కూడా---"

మర్నాడు చెప్తానని బ్రతిమలాడి పంపేశాను. నా మొహానికి ప్లాటు కొనడం కూడానా! ఎక్కడో పల్లెలో పుట్టి, LDCగా చేరి,



రిజర్వేషన్ కోటాలో UDC అను 20 మందిని దాటేసి, పైగా రియలెస్టేట్ బిజినెస్ చేస్తున్న ఎలమందంటే అందరికీ కడుపుమంటే.

విశాఖలో స్టీల్ ఫాక్టరీ (విశాఖ ఉక్కు, ఆంధ్రుల హక్కు) అను కోగానే యిళ్ల స్థలాలకు డిమాండ్ పెరిగింది. పంటలు పండని పొలాలన్నీ 'బంగారం' పండుతున్నాయి. ఎకరం అయిదు వేలు చెయ్యనిది ఏభయివేలు పలుకుతూ వుంది. రైతుల అనుమతి తీసుకొని, వాళ్ల పొలాల్ని లేఅవుట్ చేయించి, ప్లాట్లు వేసి రైతుకు తక్కువయిచ్చి, చూస్తూండగానే లక్షాధికార్లుగా మారిపోతున్న ఎలమందలాంటి వాళ్లెంతమందో!

రోజూ రకరకాల రాబడులు.

రకరకాల దోపిడీలు.

ఇది నిజంగా స్టీల్ (STEAL) సిటీయే.

వాచీ చూసుకున్నాను. గుండె గతుక్కుమంది. రిక్రియేషన్ సెంటర్ వైపుపరిగెత్తాను.

కాని — ఏం లాభం! అందరి గురించీ ఏడుస్తూ కూర్చున్నందుకు తగిన ఫలితం:

ఎంతో అవసరం వుండి యీ నెల్లో ఎలా అయినా పాడాలనుకున్న నా గ్రూప్ చీటీ పాటని అప్పుడే ఎవరి పేరనో కొట్టేస్తున్న సుబ్రహ్మణ్యం పాట విని నాకు నిజంగానే ఏడుపొచ్చింది. ●